

సోమశిలలో 72.559 టీఎంసీలు

సోమశిల: శుక్రవారానికి 72.559 టీఎంసీలు ఉన్నాయి. 16,910 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 2,650, ఉత్తరకాలువకు 250, కండలేరుకు 10,450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,16,880
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.10,535
3 శాతం జీఎస్టీతో	రూ.10,851
నవర (8 గ్రా)	రూ.86,808

గరిష్టం/కనిష్టం
30.9 /28.0

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉండి అక్కడక్కడ చిరు జల్లులు నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో తేమ 67శాతం నమోదైంది.

న్యూస్‌రీల్

పశుసంవర్థక శాఖపై ఏపీఎంలతో సమీక్ష నేడు

నెల్లూరు (పొగతోట): పశుసంవర్ధక శాఖకు సంబంధించి ఆ శాఖల అధికారులతోపాటు ఏపీఎంలకు ఈ నెల 27వ తేదీన ఉదయం 9.30 గంటలకు డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల ఏపీఎంలు హాజరుకావాలని తెలిపారు.

ఓఎన్‌జీసీ పరిశోధనలకు సిద్ధం



చిట్టేపల్లి తిప్ప వద్ద రిగ్గులు

పొదలకూరు : ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో పొదలకూరు పరిసర ప్రాంతాల్లో పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా పట్టణానికి సమీపంలో చిట్టేపల్లి తిప్ప వద్ద సుమారు 40 రిగ్గులను నిలిపారు. ఓఎన్‌జీసీ ఇంజినీర్లు బోరు పాయింట్లను నిర్దేశిస్తే వాటి ద్వారా అక్కడ సుమారు 100 అడుగుల వరకు బోర్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ముందుగా ఓఎన్‌జీసీకు చెందిన వారు ఓ సర్వే నిర్వహించి గుర్తులు పెట్టారు. చిట్టేపల్లి తిప్ప పరిసర ప్రాంతాల్లో అన్వేషణ నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే కార్పొరేషన్‌కు సంబంధించిన అధికారులెవరూ ఇంకా రాకపోవడంతో రిగ్గులను అక్కడే ఉంచారు.

రేపటి నుంచి కళాశాలలకు దసరా సెలవులు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలలకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు ఆర్ఐఓ వరప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే ఆయా యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,388 మంది తిరుమలేశుని దర్శించుకున్నారు. 21,998 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.1.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో వెంకన్నను దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

జీవన ప్రమాణాల మెరుగులో బ్యాంకర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరురూరల్: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడంలో బ్యాంకర్ల పాత్ర చాలా కీలకమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వివిధ వర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. రైతులకు విస్తృతంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న 70 వేల ఎకరాల సాగులో లేని భూమిని సాగులోకి తీసుకు రావడమే తన ప్రధాన లక్ష్యమన్న కలెక్టర్, ఇందుకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించాలన్నారు. చిరు వ్యాపారులకు ప్రధానమంత్రి ముద్రా యోజన రుణాలు, స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబనకు రుణాలు మంజూరు చేయాలన్నారు. విద్యా రుణాలను విరివిగా మంజూరు చేసి విద్యార్థులకు చేయూతనివ్వాలన్నారు. స్వయం సహాయక మహిళలకు పూర్తిగా అవగాహన కల్పించాలని డీఆర్డీఏ పీడీని ఆదేశించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజాకుమారి, మత్స్య, పశుసంవర్ధక శాఖల జేడీలు శాంతి, రమేష్‌నాయక్, ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నేత బరి తెగింపు

రూ.6 కోట్ల అమ్మవారి భూమి ఆక్రమణ



అధికారం మదంతో టీడీపీ నేత బరి తెగించాడు. జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి చెందిన రూ.కోట్ల విలువైన భూమిని కాజేస్తున్నా.. దేవదాయశాఖ అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారంటే ఈ భూదందాలో వీరి పాత్రపై అనుమానాలు తలెత్తున్నాయి. ఆలయానికి ముందే ఉన్న ఈ స్థలంలో ప్లాట్లు వేసి హద్దురాళ్లు నాటేదాక వచ్చారంటే సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కనిపిస్తోంది. గతంలోనూ సదరు నేత భూకబ్జాకు పాల్పడే ప్రయత్నం చేస్తే అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అడ్డుకుని పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈ భూమికి సంబంధించిన వివాదం ఆర్డీఓ కోర్టులో ఉన్నప్పటికీ తాజాగా పాట్లు వేశాదంటే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అండదండలతోనే ఇదంతా జరుగుతుందనే ఆరోపణలున్నాయి.

- ఇప్పటికే ఆర్డీఓ కోర్టులో కేసు నడుస్తున్న వైనం
- భూ కబ్జాపై మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్న హయాంలో కఠిన చర్యలు
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అండతోనేనా ఆలయ మాజీ చైర్మన్ దుస్సాహసం
- ప్లాట్లు వేసి విక్రయించేందుకు రంగం సిద్ధం
- కళ్ల ముందే కనిపిస్తున్నా.. దేవదాయశాఖ అధికారులు మౌనం



కామాక్షితాయి ఆలయ భూమిని ఆక్రమించి చదును చేసిన దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కోవూరు నియోజకవర్గం మాఫియాలకు అడ్డాగా మారింది. ఇసుక, రేషన్ బియ్యం, చికెన్ వేస్ట్, పశువుల అక్రమ రవాణా మాఫియాలు చెలరేగుతుంటే.. తాజాగా భూ మాఫియా కూడా కోరలు చాస్తోంది. టీడీపీ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని సహజ వనరుల నుంచి సర్కారు భూములు, చివరకు ఆలయ భూముల వరకు దోచుకుంటున్నారు. ఎవరి స్థాయిలో వాళ్లు దొరికిన కాడకి దిగమింగుతున్నారు. ఒక్కొక్క మాఫియా లీడర్ ఏడాది కాలంలో రూ.కోట్లకు పడగలెత్తారంటే అతిశయోక్తి లేదు. కలియుగంలో దుష్టులను దండించిన ప్రత్యక్ష అపర కాళికాదేవిగా, మహిమాన్విత అమ్మవారు మండలంలోని జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయం ముందు భాగంలో పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రూ.6 కోట్ల విలువ చేసే ఎకరా స్థలాన్ని స్థానిక టీడీపీ నాయకులు ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు.

స్థానిక టీడీపీ నేతల హస్తం

జొన్నవాడలోని టీడీపీ నాయకులు, అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ భూ ఆక్రమణకు పాల్పడినట్లు తెలుస్తోంది. సర్వే నంబర్ 129లో కొంత, 91సీలో మరికొంత కలిసి దాదాపు ఎకరాపైన ఉంది. ఈ స్థలంలో ఆలయం, గ్రామానికి చెందిన మురుగునీరు శుద్ధిచేసి నదిలో వదిలేందుకు ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఇంకుడు గుంతలు తీసే సమయంలో వచ్చిన మట్టిని అదే స్థలంలో చదునుచేసి హద్దు రాళ్లు నాటి ప్లాట్లుగా మార్చారు. బయట నుంచి మట్టి తోలితే అనుమానం కలుగుతుందన్న ఉద్దేశంతో ఈ పని చేశారు. ప్రస్తుతం గుట్టు చప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూమి కబ్జాకు గురికావడం చూస్తే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అండదండలతోనే ఇదంతా జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జొన్నవాడకు చెందిన పి. సాగర్ ఆలయ భూమి కబ్జా విషయమై మూడు నెలల క్రితం నెల్లూరు ఆర్డీఓ, రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మాజీమంత్రి ప్రసన్న హయాంలో రక్షణ

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కోవూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి భూ కబ్జాలపై కఠినమైన చర్యలు తీసుకున్నారు. కామాక్షితాయి ఆలయ భూములు ఆక్రమణకు గురికాకుండా ఎప్పటికప్పుడు ఆలయ ఈఓ, అధికారులతో సమీక్షలు నిర్వహించి పటిష్ట చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఆలయ ముందుభాగంలో కబ్జాదారులు ప్లాట్లు వేసేదాకా వచ్చారంటే ఆలయ సిబ్బంది పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు, ఈ వ్యవహారమంతా ఆలయ ఈఓ, సిబ్బందికి తెలిసే జరుగుతుందా అనే అనుమానాలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుత ఎమ్మెల్యే పర్యవేక్షణ శూన్యం



హద్దు రాళ్లతో ఏర్పాటు చేసిన ప్లాటు

ప్రస్తుతం కోవూరు ఎమ్మెల్యేగా ఉన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆలయ భూముల అన్యాక్రాంతం విషయమై ఎప్పుడూ చర్చించిన సందర్భమే లేదు. అమ్మవారి అపర భక్తురాలిగా ప్రచారం చేసుకునే ప్రశాంతిరెడ్డి ఆలయ భూములకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని భక్తులతోపాటు జొన్నవాడ వాసులు మండిపడుతున్నారు. ఆలయానికి రావడం, దర్శనం చేసుకొని వెళ్లిపోవడం తప్పిస్తే ఆలయానికి సంబంధించిన ఆస్తులు, భూములు ఎక్కెడెక్కడ ఉన్నాయి, వాటి స్థితిగతులేంటనే విషయాలపై పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు విమర్శిస్తున్నారు. టీడీపీ నేతలే కబ్జాలకు పాల్పడుతుండటంతో ఆమెకు తెలిసినా చర్యలు తీసుకోవడం అభిప్రాయం ప్రజల్లో కలుగుతోంది. ప్రస్తుతం దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి శరన్నవరాత్రులు జరుగుతున్నాయి. భక్తులు ప్రతి రోజు వేల సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకొని వెళ్తున్నారు. ఇదే సమయంలో ఆలయం ముందు భాగంలో స్థలం ఆక్రమణకు గురైన విషయాన్ని గుర్తించిన పలువురు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టకపోతే భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

అధికారులకు ఫిర్యాదు చేస్తాం

ఆలయ భూమి కబ్జా విషయం నా దృష్టికి వచ్చింది. దీనికి సంబంధించిన వివాదంపై ఆర్డీఓ కోర్టులో కేసు కొనసాగుతోంది. ఆక్రమణకు గురైన భూమి ఆలయానికి సంబంధించిందే. మరో సారి ఆర్డీఓ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామం. వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎ. వెంకటశ్రీనివాసులురెడ్డి, ఈఓ, కామాక్షితాయి ఆలయం

బాలకృష్ణ వ్యాఖ్యలు దుర్మార్గం

- వైఎస్సార్ సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: అసెంబ్లీ వేదికగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై హిందుపూరం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, అత్యంత దుర్మార్గమని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సభలో బాలకృష్ణ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి అమర్యాదకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాలకృష్ణకు లేదన్నారు. చిరంజీవి, చంద్రబాబుతో విభేదాలుంటే వారితోనే తేల్చుకోవాలే తప్ప నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదన్నారు. అసెంబ్లీలో సభ్యసమాజం తలదించుకునేలా ఆయన మాట్లాడటం తగదన్నారు. సభా మర్యాదలు పాటించకుండా మాట్లాడి ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలని అనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. సభలో ఎమ్మెల్యే బాలకృష్ణ తీరు చూశాక ఆయనకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలేమో అనిపించేలా ఉందన్నారు. బాలకృష్ణ సొంత ఇంట్లో కాల్పులు జరిపి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ తెలుసునన్నారు. మాజీ సీఎం జగన్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని జంకె సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నకిలీ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అరెస్ట్

- అతని తండ్రిని కూడా...



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు

నెల్లూరు (క్రైమ్): క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పేరిట అటవీ శాఖలో ఉద్యోగాలిప్పిస్తానని నిరుద్యోగులను మోసగించిన నిందితుడితోపాటు అతని తండ్రిని సైతం వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. న్యూమిలటరీ కాలనీకి చెందిన వినోద్‌కుమార్ బీటెక్ పూర్తి చేసి తన మామ కేఫ్‌లో పని చేస్తుండగా, శివాజీనగర్‌లో ఉంటున్న దేవళ్ల సాయికృష్ణ తరచూ కేఫ్‌కు వస్తూ తాను విజయవాడ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌నని పరిచయం చేసుకున్నాడు. అటవీశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని వినోద్‌కుమార్‌ను నమ్మించి రూ.6.51 లక్షల నగదు, ఆరు సవర్ల బంగారు ఆభరణాలు మొత్తంగా రూ.11 లక్షలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడం, అడుగుదామని వెళ్లితే సాయికృష్ణ తప్పించుకుని వెళుతుండడంతో మోసపోయానని వినోద్‌కుమార్ గ్రహించాడు. తన మాదిరిగా ఉద్యోగాల పేరిట ఎన్‌సీసీకాలనీకి చెందిన పావని, భారతి, దగర్తికి చెందిన హేమంత్ వద్ద నుంచి రూ.40 లక్షలు తీసుకుని మోసగించినట్లు వినోద్‌కుమార్‌కు తెలిసింది. ఉద్యోగాల పేరిట మోసగించిన సాయికృష్ణపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 24న వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి గురువారం రాత్రి తెలుగుగంగ కార్యాలయం సమీపంలో సాయికృష్ణను, అతని తండ్రి పోలయ్యను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారణలో నిందితుడికి తండ్రి సహకరించాడని వెల్లడైంది. దీంతో నిందితులిద్దరిని శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి నకిలీ పోలీసు ఐడీ కార్డు, న్యూరో, ఆర్థో, సీనియర్ డాక్టర్ పేర్లతో నకిలీ ఐడీ కార్డులు, రెండు స్కూటీలు, బుల్లెట్, ఒక బైక్, బీఎండబ్ల్యూ కారు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వద్ద న్యూరో, ఆర్థో డాక్టర్ పేర్లతో ఉన్న ఐడీ కార్డులు దొరకడంతో వాటిని ఉపయోగించి ఏమైనా నేరాలకు పాల్పడ్డారా? అనే కోణంలో విచారిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల అభినందించారు. సమావేశంలో ఎస్ఐ ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కర్షకుడి కంట కన్నీరు



నీట మునిగిన కోతకొచ్చిన పంట



నీరు నిలిచి పంట నేలబడి మొలకలు వచ్చాయని చూపుతున్న రైతులు

- టీడీపీ నేతల స్వార్థం.. రైతులకు కష్టం
- చెరువులో చేపలు పట్టుకునేందుకు నీటి విడుదల
- కోత దశలో ఉన్న 120 ఎకరాల వరి పంట నీట మునిగిన వైనం
- రైతులు, అధికారుల చెప్పినా వినకుండా చెరువు తూము నుంచి నీటి విడుదల

టీడీపీ నేతలు తమ స్వార్థం కోసం ఏకంగా నిండు చెరువు నీటిని దిగువకు వృథాగా వదిలేయడం చూస్తే అధికార అహంకారానికి నిదర్శనంగా నిలుస్తోంది. చెరువు నీటిని ఆధారంగా చేసుకుని ఆయకట్టు కింద వందల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం వరి కోతల దశలో ఉండగా, చెరువు నీటిని దిగువకు వదలకుండా తూములు బిగించేశారు. అయితే చెరువులో చేపల పట్టుకునే హక్కులను వేలంలో దక్కించుకున్న టీడీపీ నేతలు రైతుల ప్రయోజనాలను తుంగలో తొక్కి చెరువులో నీటిని దిగువకు వదిలేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నీట మునిగిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఉదయగిరి: జలదంకి మండలం లింగరాజుఅగ్రహారంలో ముగ్గురు టీడీపీ నేతల స్వార్థానికి కోత దశలో ఉన్న 120 ఎకరాల వరి పంట నీట మునిగింది. చేతికందే పంట మొత్తం నీటి పాలై దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికే వేలకు వేలు అప్పులు తెచ్చి బ్లాక్‌మార్కెట్లో ఎరువులు కొని పంట సాగు చేయడానికి అష్టకష్టాలు పడ్డారు. ప్రస్తుతం ధాన్యం ధరలు సైతం పతనమైన నేపథ్యంలో కనీసం పెట్టుబడి అయినా దక్కితే మేలనుకుంటూ ఎదురుచూస్తున్న తరుణంలో టీడీపీ నేతల దుశ్చర్యతో రైతులకు పిడుగుపాటుగా మారింది.

ఆయకట్టును నమ్ముకుని వరి సాగు

లింగరాజుఅగ్రహారం చెరువు ఆయకట్టు కింద ఖరీఫ్‌లో సుమారు 270 ఎకరాల్లో వరి సాగు చేశారు. మరో వారం.. పది రోజుల్లో కోత కోసే పరిస్థితికి పంట వచ్చింది. ఈ తరుణంలో చేపలు పట్టుకునేందుకు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు గుర్రం ప్రవీణ్, గొట్టిపాటి శ్రీధర్, రాయపాటి మోహన్‌రావు చెరువులో చేపలు పట్టుకునేందుకు వేలం ద్వారా అనుమతులు దక్కించుకున్నారు. అయితే నిండుకుండగా ఉన్న చెరువులో చేపలు పట్టడం సాధ్యం కాని పరిస్థితి. దీంతో టీడీపీ నేతలు రైతులను దృష్టిలో పెట్టుకోకుండా చెరువు తూములు ఎత్తి నీటిని పొలాలకు మళ్లించారు. దీంతో గ్రామానికి చెందిన చెరువు ప్రెసిడెంట్ గుర్రం సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ గాలి మాల్యాద్రి రైతులతో కలిసి చెరువు తూము ద్వారా పొలాలకు నీరు వెళ్లకుండా నిలుపుదల చేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకులు తిరిగి తూమును ఎత్తేశారు. ఫలితంగా సుమారు 120 ఎకరాల్లోని వరి పంట పొలాల్లో మోకాలి లోతు నీళ్లు నిలబడిపోయాయి.

ఏఈ ఆదేశాలు పట్టించుకోకుండా..

ఈ విషయాన్ని ఇరిగేషన్ ఏఈ మాల్యాద్రికి రైతులు వివరించడంతో ఆయన వచ్చి చెరువు తూము నుంచి నీరు పారకుండా చేయాలని చెప్పారు. ఆయన్ను సైతం ధిక్కరించి దిక్కున్నచోట చెప్పుకోండని అనడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వారం రోజుల పాటు నీరు విడుదల చేయకుంటే తాము చేతి కొచ్చిన పంటను కోసుకుంటామని చెబుతున్నా వినకుండా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడంపై గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు పొలాలకు ప్రవహించడంతో నీరు ఎక్కువై పంట మొత్తం నీటితో నాని నేతలకు పడిపోయింది. దీంతో రైతులు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు.. జలదంకి సొసైటీ చైర్మన్ అప్పలనాయుడు నీట మునిగిన పొలాలను పరిశీలించారు. పంట నష్టం జరిగిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అయితే మూడు రోజులు గడుస్తున్నా చెరువు తూము నీటిని నిలుపుదల చేయలేదని, తమ పంట మొత్తం నీటిలో నానుతూ మొలకలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. చెరువు చైర్మన్ గుర్రం సుబ్బారావు, వైస్ చైర్మన్ గాలి మాల్యాద్రి, గ్రామ రైతు నాయకుడు గాలి సురేష్ మాట్లాడుతూ చెరువులో చేపలు పట్టుకుని జేబులు నింపుకొనేందుకే తాము ఆరుగాలం పండించిన పంటను ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కోతకు వచ్చిన పంట నేలపాలైంది



టీడీపీ నాయకులు ఆగడాలు ఎక్కువయ్యాయి. చెరువు పరిధిలో 120 ఎకరాల పంట కోత దశలో ఉంది. వారం రోజుల తర్వాత నీటిని విడుదల చేసుకోండి అని చెప్పినా వినకుండా దౌర్జన్యంగా ఇరిగేషన్ ఏఈ చెప్పినా చెరువు తూమును ఎత్తారు. దీంతో పంట మొత్తం నీట మునిగి పాడైపోయింది. గింజలు నాని మొలకలు వస్తున్నాయి. మాకు న్యాయం చేయాలి.

– గుర్రం సుబ్బారావు, చెరువు ప్రెసిడెంట్, ఎల్ఆర్ అగ్రహారం

నాయకులు, అధికారులు బాధ్యత వహించాలి



చేతి కొచ్చిన పంటను నాశనం చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. చెరువు తూము ఎత్తితే 120 ఎకరాల కోత కొచ్చిన పంట ధ్వంసం అవుతుందని చెప్పినా అధికారుల మాటలు, రైతుల రోదనలు వినకుండా నీటిని విడుదల చేశారు. వాళ్ల స్వార్థం కోసం రైతుల నోరు కొట్టడం దారుణం. రాష్ట్రంలో ఎక్కడా ఇటువంటి పరిస్థితి జరగలేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, సీఎం, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. తమకు నష్ట పరిహారం అందేవరకు పోరాడుతాం.

– గాలి సురేష్, రైతు, ఎల్ఆర్ అగ్రహారం

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నామని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. పంచాయతీ రాజ్, గృహనిర్మాణం, ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్, జిల్లా పరిశ్రమలు, డీఆర్‌డిఏ, అటవీ, మైక్రో ఇరిగేషన్, ఏపీపి సీడ్స్, విద్యా, ప్రభుత్వ ప్రధాన హాస్పటల్, వైద్య విధాన పరిషత్, ఐసీడీఎస్, దివ్యాంగులు, గిరిజన సంక్షేమం తదితర శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. సమావేశాలకు జెడ్పీటీసీ సభ్యులు, ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

లోకపావనీ.. పాహిమాం

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారు శుక్రవారం వివిధ రూపాల్లో భక్తులను కరుణించారు. అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని భక్తజనం తిలకించి మైమరిచిపోయింది. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి ఆలయాలు సందడిగా మారాయి.

– సాక్షి నెట్‌వర్క్


నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో మహాలక్ష్మి అలంకారం


మూలాపేటలో అన్నపూర్ణదేవిగా..


కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో లక్షగాజులతో అలంకరణ


సరస్వతీదేవి అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు


జొన్నవాడలో రాజరాజేశ్వరి అలంకరణలో కామాక్షితాయి


రాపూరు : పెంచలకోనలో గజలక్ష్మిగా ఆదిలక్ష్మీదేవి

శ్రుతిమించుతున్న హిజ్రాల ఆగడాలు

- భయాందోళనలో ప్రజలు


బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ధాబా ఘటనలోని నిందితులు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో హిజ్రాల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. రహదారులపై వెళ్లేవారిని అడ్డుకుని నగదు కోసం పీడిస్తున్నారు. దుకాణాల వద్దకు వెళ్లి డబ్బు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వని వారిపై దౌర్జన్యాలు, దాడి చేసి అందిన కాడికి దోచుకెళ్తున్నారు. నడిరోడ్లపై బరితెగిస్తున్నా పోలీసులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

తాజాగా రెండుచోట్ల..

కందుకూరు, నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో చోటుచేసుకున్న ఘటనలు హిజ్రాల బరితెగింపు చర్యలకు తార్కాణంగా నిలుస్తున్నాయి. నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, బోసుబొమ్మ, గాంధీబొమ్మ సెంటర్, విజయమహల్‌గేటు, ఆర్టీసీ ఇలా ప్రధాన కూడళ్లలో పదుల సంఖ్యలో హిజ్రాలు రోడ్లపైకి వచ్చి అటుగా వెళ్లే వాహనదారులను నగదు కోసం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నగదు ఇవ్వని వారితో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు నానా దుర్భాషలాడుతున్నారు. పండగల వేళ గుంపులుగా షాపుల వద్దకెళ్లి నగదు డిమాండ్ చేస్తున్నారు. వ్యాపారస్తులు ఎంతో కొంత ఇస్తే తీసుకోకుండా తాము అడిగినంత ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవ్వకపోతే దుకాణాల వద్దే బైఠాయించి వ్యాపారాలు జరగకుండా అడ్డుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో అక్కడున్న వస్తువులను ధ్వంసం చేస్తున్నారు. వీరి చేష్టలకు బెదిరిపోతున్న కొనుగోలుదారులు అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోతున్నారు.

తరచూ ఘటనలు

విజయమహల్ గేటు సమీప రైల్వేట్రాక్ వెంబడి రాత్రివేళల్లో చీకటి కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆ ప్రాంతంలో హాస్పిటళ్లు ఉన్నాయి. రాత్రి వేళల్లో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దసరా పండగ వస్తే మామూళ్ల కోసం వీరు బరితెగిస్తున్నారు. తాజాగా మినీబైపాస్ రోడ్డులోని ఓ ఫ్యామిలీ ధాబాలో మామూళ్ల కోసం 13 మంది వీరంగం చేసిన ఘటనలో నిందితులను బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు నగరంలో తరచూ చోటుచేసుకుంటున్నాయి. బెదిరిపోయిన వ్యాపారులు ఫిర్యాదులు చేసేందుకు ముందుకు రావడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

విషాద ప్రయాణం

- నెత్తురోడుతున్న రహదారులు
- వేగం, రాంగ్‌రూట్, మద్యం మత్తు తదితరాలే కారణాలు
- బ్లాక్‌స్పాట్లలో కానరాని చర్యలు
- ఈ ఏడాది 390 మంది మృత్యువాత


పోతిరెడ్డిపాళెంలో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని రహదారులు నిత్యం రక్తసిక్తమవుతున్నాయి. రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం, నిర్లక్ష్యంగా నడిపే వాహనచోదకులు, కనీస విశ్రాంతి ఇవ్వకుండా విధులకు వెళ్లమంటున్న యజమానులు, బ్లాక్‌స్పాట్లలో హెచ్చరిక బోర్డులు లేకపోవడం.. ఇలా కారణాలతో యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఆనందంగా సాగిపోతున్న ప్రయాణాల్లో అంతలోనే అంతులేని విషాదం కమ్మేస్తోంది. కన్నవారిని, కడుపున పుట్టిన వారిని, అయిన వారిని కోల్పోయిన కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోతున్నాయి. ప్రమాదాల కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు దృష్టిసారించడం లేదు. ఫలితంగా జిల్లాలో తొమ్మిది నెలల వ్యవధిలో 670 ప్రమాదాలు జరగ్గా 390 మంది మృత్యువాత పడ్డారు. 645 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. ప్రమాదాల తీవ్రత తక్షణం మేల్కోవాల్సిన అవసరాన్ని చాటిచెబుతోంది.

కారణాలెన్నో..

మితిమీరిన వేగం, ఓవర్‌టేక్, అకస్మాత్తుగా వాహనాలు నిలపడం, నిద్ర, మద్యం మత్తులో నడపడం, పరిమితికి మించిన ప్రయాణం, అపసవ్యదిశలో రాకపోకలు సాగించడం, హెల్మెట్, సీట్ బెల్టులు పెట్టుకోకపోవడం, సకాలంలో గమ్యస్థానాలకు వెళ్లాలన్న తొందరలో వేగంగా నడపడం, రహదారి భద్రత నిబంధనలపై అవగాహన లేమి, వాహనాల సామర్థ్యం సరిగా లేకపోవడం, దెబ్బతిన్న రహదారులు తదితరాలు ప్రమాదాలకు కారణాలుగా ఉన్నాయి.

రెస్ట్ ఏరియాలున్నా..

నెల్లూరు – బద్వేల్ రహదారిలో రెండు, ఏర్పేడు – రాపూరు జాతీయ రహదారిపై రెండు, పోర్టుకు వెళ్లే రహదారిలో ఒకటి, వెంకటాచలం వద్ద, గౌరవరం ప్రాంతాల్లో రెస్ట్ ఏరియాలున్నాయి. అధికశాతం మంది వాటిల్లో కాకుండా రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపివేస్తున్నారు. కనీసం అప్రమత్తం చేసేలా ఇండికేటర్లు, స్టిక్కరింగ్‌తో కూడిన ట్రయాంగిల్ గుర్తులూ వాడకపోవడంతో వెనుక వచ్చేవారికి వాహనాలు కనిపించక వేగంగా ఢీకొడుతున్నారు.

కనీస చర్యలేవి?

మూడు క్యాలెండర్ సంవత్సరాల్లో ముగ్గురు కంటే ఎక్కువగా ఒకే ప్రాంతంలో మరణించి ఉంటే దాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తిస్తారు. జిల్లాలో 65 బ్లాక్‌స్పాట్లున్నాయి. అందులో ఎన్‌హెచ్ 16పై 46, ఎన్‌హెచ్ 67పై ఎనిమిది, 565వ జాతీయ రహదారిపై 11 ఉన్నాయి. వీటితోపాటు మరికొన్ని రహదారుల్లోనూ బ్లాక్‌స్పాట్లున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు గానూ ఇసుక డ్రమ్ములు, బారికేడ్లు, ములుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, సోలార్ విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్డు సేఫ్టీ సమావేశాల్లో అధికారులు తీర్మానించారు. అయితే అనేక ప్రాంతాల్లో ఇవి అమలుకు నోచుకోలేదు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద నిర్దిష్ట చర్యలు, కమిటీ నిర్ణయాల అమలుపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

గస్తీ ఏది?

జిల్లాలో ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారిపై ఆరు హైవే మొబైల్స్, ఎన్‌హెచ్ 67పై రెండు, రాపూరు వైపు ఒక హైవే మొబైల్ ఉంది. అందులో డ్రైవర్‌తో కలిసి ఇద్దరు నుంచి ముగ్గురు సిబ్బంది ఉంటారు. వీరు రోడ్డు ప్రమాదాలు, నేరాలు జరగకుండా గస్తీ నిర్వహించాల్సి ఉంది. ఇంటర్‌సెప్టర్ వాహనంతో నిత్యం వాహన తనిఖీలు చేపట్టాలి. అయితే ఈ వ్యవస్థ మొక్కుబడి చర్యలకే పరిమితమైందనే విమర్శలున్నాయి.

మొక్కుబడిగా..

జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో కొన్ని నిద్రమత్తులోనే జరుగుతున్నాయని గుర్తించిన పోలీస్ అధికారులు డ్రైవర్‌ను మేలుకొలిపేలా స్టాప్ – ఫేస్‌వాష్ పేరిట వినూత్న కార్యక్రమాన్ని రెండేళ్ల క్రితం చేపట్టారు. జాతీయ రహదారులపై అర్ధరాత్రి వేళల్లో పోలీసులు డ్రైవర్లచే ఫేస్‌వాష్ చేయించి వారితో మాటామంతి కలిపి జాగ్రత్తలను వివరించేవారు. దీంతో కొంత మేర ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. కాలక్రమేణా పోలీసు అధికారులకు బందోబస్తులు అధికమవడం, నిత్యం ఏదో ఒక కార్యక్రమం ఉండటంతో ఈ ప్రక్రియ అంతంతమాత్రంగానే సాగుతోంది.

రెండేళ్లలో 840 మంది మృతి

జిల్లాలో రోజురోజుకు రహదారి ప్రమాదాలు పెరుగుతున్నాయి. గడిచిన రెండేళ్లలో 840 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందారు. 1,550 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. 2024లో 828 ప్రమాదాలు జరగ్గా 450 మంది చనిపోయాగా 905 మంది క్షతగాత్రులయ్యారు. ప్రమాదాల కట్టడిలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి.

కొన్ని ఘటనలు

- ఏప్రిల్ 29వ తేదీన నార్తురాజుపాళెం సమీపంలో జాతీయ హదారిపై ఆగి ఉన్న లారీనీ బైక్ ఢీకొంది. ఈ ఘటనలో బోగోలు పంచాయతీకి చెందిన షేక్ మన్సూర్‌బాషా, విశ్వనాథరావుపేట రామస్వామిపాళేనికి చెందిన ప్రవీణ్‌కుమార్ మృతిచెందారు.
- ఏప్రిల్ 30వ తేదిన కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం వద్ద మితిమీరిన వేగంతో కారు ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయారు.
- ఉలవపాడు మండలం చాగల్లు వద్ద గతనెల 8వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్త గణేశునిపాడుకు చెందిన ముగ్గురు మృతిచెందారు.
- సిద్ధిపురం పంచాయతీ అనసూయనగర్‌కు చెందిన వెంకటశేషయ్య, వెంకటవరలక్ష్మి దంపతులు సొంత ఆటోలో కూరగాయాలు విక్రయించేందుకు వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. వారిద్దరూ దుర్మణం చెందారు.
- ఇటీవల సంగం మండలం పెరమన జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వచ్చిన టిప్పర్ కారును ఢీకొంది. దీంతో కారులోని ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు.

క్లుప్తంగా

గాల్లో తేలినట్టుందే..


ఘటనా స్థలంలో టిప్పర్

సీతారామపురం: గంటల తరబడి టిప్పర్ గాల్లో ఉండటం స్థానికులను ఆందోళనకు గురిచేసింది. వేదగర్భ పాఠశాల వద్ద గృహ నిర్మాణం కోసం శుక్రవారం ప్రకాశం జిల్లా పామూరు నుంచి ఇటుకల లోడుతో టిప్పర్ వచ్చింది. అన్‌లోడ్ చేసే సమయంలో డ్రైవర్ లిఫ్ట్‌ను పైకెత్తగా వెనుక భాగాన ఇటుకల బరువు అధికమై టిప్పర్ గాల్లోకి లేచింది ముందుకు జరిపితే ఒక్కసారిగా పైనుంచి కిందకు పడి వాహనం దెబ్బతింటుందని భావించిన డ్రైవర్ ఏం చేయకుండా అలాగే ఉండిపోయాడు. సుమారు మూడున్నర గంటల పాటు టిప్పర్ గాల్లో ఉండిపోయింది. చివరికి జేసీబీని తీసుకొచ్చి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది.

బకాయిలు విడుదల చేయాలంటూ నిరసన


నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నేతలు

నెల్లూరు రూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ ఏబీవీపీ నేతలు శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా హాస్టళ్ల కన్వీనర్ సుకుమార్ మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆయన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

మాలకొండలో దేవదాయ శాఖ విచారణ

- దర్శన టికెట్ల పెంపుపై సాక్షిలో కథనం
- వివరణ కోరిన కలెక్టర్
- 22వ తేదీన విచారణ చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కందుకూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దర్శన టికెట్ల ధర పెంపుపై వచ్చిన ఆరోపణలపై దేవదాయశాఖ అధికారులు విచారణ చేశారు. ఈనెల 21వ తేదీన సాక్షిలో 'అంతా నా ఇష్టం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా వివరణ కోరారు. 22న జిల్లా దేవదాయ శాఖ అధికారి జనార్దనరెడ్డి వచ్చి విచారణ చేశారు. అనంతరం నివేదికను అధికారులు కలెక్టర్‌కు సమర్పించారు.

పొంతన లేని విచారణ

నివేదిక ప్రకారం ఈనెల 13వ తేదీన దేవదాయ డిప్యూటీ కమిషనర్ మాలకొండ దేవస్థానాన్ని సందర్శించి రోజువారి పరిపాలనలో చేయాల్సిన 17 అంశాలపై ఈఓకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు స్వామి అంతరాలయంలోనే కొబ్బరికాయలు కొట్టే సంప్రదాయం ఉందని, అయితే భక్తులు అధికంగా వచ్చినప్పుడు ముఖమండపం వద్ద కొబ్బరికాయలు కట్టే స్థలాన్ని మార్చాలని డీసీ చెప్పారు. దీంతో ముఖమండపం వద్దకు మార్చారు. అలాగే ఇప్పటి వరకు స్వామి అంతరాలయ దర్శన టికెట్ ధర రూ.100 ఉండేదని, దాన్ని కమిషనర్ సూచనల మేరకు ఇద్దరు వ్యక్తులకు కలిపి రూ.500 పెంచారు. ప్రస్తుతం ఉచిత దర్శనం, రూ.100, రూ.500 దర్శన మూడులైన్లు ఏర్పాటు చేశారని నివేదికలో పొందుపరిచారు.

తప్పులమయం

వాస్తవానికి స్వామి అంతరాలయ దర్శనం ఇప్పటి వరకు రూ.100 మాత్రమే ఉండేది. దీనిపై భక్తులకు సమాచారం లేకుండా రూ.500కు పెంచారు. దీంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ విషయమే సాక్షిలో ప్రచురితమైంది. అయితే ఇది అబద్ధమన్నట్లు ప్రస్తుతం కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో అధికారులు సర్ది చెప్పుకోవడం గమనార్హం. ఇద్దరు వ్యక్తులకు రూ.500 చేశామని చెప్పుకోవడం గమనార్హం. అంటే అంతరాలయ దర్శనం టికెట్ ధరలు పెంచామని ఒప్పుకొంటూనే మరోపక్క పత్రికలో అసత్యాలు ప్రచురించారని వివరణ ఇచ్చుకున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

కానుకల లెక్కింపు సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేసి సీసీ కెమెరాల పర్యవేక్షణలో చేస్తున్నామని, అన్నదాన సత్రంలో కూడా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని పొందుపరిచారు. అలాగే టికెట్ ధరలు రూ.500 చేసిన తర్వాత రూ.50 వేల వరకు ఆదాయం వచ్చిందన్నారు. ఈ అంశాలపై వివరణ కోసం ఆలయ ఈఓను సాక్షి సంప్రదించినప్పుడు తాము వెటకారంగా సమాధానం చెప్పలేదని, భక్తుల రద్దీ అధికంగా ఉండటం వల్ల తర్వాత మాట్లాడతానని మాత్రమే ఈఓ సమాధానం చెప్పారని కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో జిల్లా దేవదాయశాఖ అధికారి పేర్కొనడం గమనార్హం.

గిరిజన మహిళది హత్యగా ప్రచారం

- పోలీసుల అదుపులో సహజీవనం చేస్తున్న వ్యక్తి
- జీజీహెచ్‌లో పోస్టుమార్టం

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో చనిపోయిన గిరిజన మహిళ ప్రసూన (25)ది హత్యగా ప్రచారం జరుగుతోంది. గ్రామంలో నివాసమున్న తాపీమేస్త్రి కొంతకాలంగా ఆమెతో సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. బుధవారం రాత్రి గిరిజన మహిళ అపస్మారక స్థితిలో ఉండగా తాపీమేస్త్రి గ్రామంలో ఓ ఆర్‌ఎంపీ వద్దకు మోసుకెళ్లి వైద్యం చేయాల్సిందిగా కోరినట్టు చెబుతున్నారు. ఆయన తన వల్ల కాదని చెప్పడంతో మేస్త్రి ఆమెను ఇంటి వద్ద పడేసి వెళ్లిపోయినట్టు ప్రచారం జరుగుతోంది. గురువారం ఉదయం ప్రసూన మృతి విషయం ఆమె బంధువైన వృద్ధురాలికి తెలిసి గగ్గోలు పెట్టడంతో సమాచారం పోలీసులకు తెలిసింది. వీఆర్వో పుల్లయ్య ద్వారా విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కాగా ప్రసూనపై లైంగిక దాడి చేసి, హత్య చేశారని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన మహిళ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ విషయమై శుక్రవారం పొదలకూరు సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాథమికంగా పరిశీలిస్తే గిరిజన మహిళది హత్యగా భావించలేమన్నారు. సహజీవనం చేస్తున్న వ్యక్తిని విచారించామని, పోస్టుమార్టం నివేదిక అందితే అన్ని విషయాలు తెలుస్తాయన్నారు.

కండలేరులో 55.220 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 55.220 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10.100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	రూ.115
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్	రూ.210
స్కిన్‌లెస్ చికెన్	రూ.232
లేయర్ చికెన్	రూ.187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.40
సన్నవి	రూ.25
పండ్లు	రూ.15